

ఆధార్‌కు ఓటరు ఐడి అనుసంధానం

శ్రీకాకుళం : ఆధార్ కార్డుకు ఓటరు గుర్తింపు కార్డును అనుసంధానం చేసుకోని వారు ఫారం-6బి ద్వారా అనుసంధానం చేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఓటర్లకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ నుంచి ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, బిఎల్ఒలతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఓటరు స్వచ్ఛందంగా తన ఆధార్ కార్డుకు ఓటరు గుర్తింపు కార్డును అనుసంధానం చేసుకోవాలని తెలిపారు. గతంలో ఇచ్చిన పిలుపునకు కొందరు మాత్రమే స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌కు అనుసంధానం చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఓటర్లు తప్పనిసరిగా తన ఆధార్ కార్డుకు ఓటరు ఐడిని లింక్ చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి వారి పరిధిలోని బిఎల్ఒల వద్దకు వెళ్లి ఫారం-6బి ద్వారా వారి ఆధార్‌కు ఓటరు ఐడిని లింకు చేసుకోవాలని తెలిపారు.

ఎవరి లెక్కలు వారివే

- పోలింగ్ శాతం భారీగా ఉండడంతో వైసిపిలో గుబులు
- వైసిపిపై వ్యతిరేకతనే నమ్ముకున్న టిడిపి
- ప్రత్యామ్నాయ విధానాలే తమను గెలిపిస్తుందన్న ధీమాలో పిడిఎఫ్
- కీలకం కానున్న రెండో ప్రాధాన్యత ఓటు!

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ ముందు రోజు వరకు ప్రధానంగా పిడిఎఫ్, వైసిపి, టిడిపి మధ్య పోరు నెలకొందని ప్రచారం సాగింది. పోలింగ్ సరళిని బట్టి జిల్లాలో పిడిఎఫ్, టిడిపి హోరాహోరిగా తలపడ్డాయి. పిడిఎఫ్ ఎమ్మెల్సీ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వైపు కాస్త మొగ్గు కనిపించినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని వైసిపి నేతలు గట్టిగా నమ్మినా, ఆ రకమైన ఓటింగ్ కనిపించలేదని ఆ పార్టీ నాయకులే చెప్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



రమాప్రభ



చిరంజీవి



సుధాకర్

జిల్లాలో 52,256 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌లో 37,653 (72.05 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుష ఓటర్ల కంటే మహిళల ఓటింగ్ శాతమే ఎక్కువగా ఉంది. మహిళా ఓటర్లు 15,839 మందికి గానూ 11,534 మంది (72.82 శాతం) ఓటు వేశారు. పురుష ఓటర్లు 36,412 మంది ఉండగా 25,883 మంది (71.08 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులన్నీ అదేరోజు రాత్రి ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు నడుమ విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియానికి తరలించారు. ప్రస్తుతానికి అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమై ఉంది. ఈనెల 16న ఓట్ల లెక్కింపు జరుగనుంది. అదేరోజు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

భారీ ఓటింగ్‌తో అధికార పార్టీలో గుబులు

జిల్లాలో ఈ పర్యాయం భారీగా పోలింగ్ శాతం నమోదైంది. పట్టభద్రుల ఎన్నికల్లో గతంలో ఓటు వేసేందుకు ఓటర్లు పెద్దగా ఆసక్తి కనబరిచేవారు కాదు. ఈసారి గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్యూలైన్‌లో నిల్చొన్న వారు సైతం ప్రభుత్వ వ్యతిరేక విధానాలపైనే మాట్లాడడం కనిపించింది. దీంతో అధికార పార్టీ నేతల్లో గుబులు మొదలైంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎవరికి బదిలీ అయిందన్నది చూడాల్సి ఉంది.

పిడిఎఫ్ వైపు మొగ్గు

పట్టభద్రుల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజా కార్మిక సంఘాలు పిడిఎఫ్ పక్షాన నిలబడడంతో జిల్లాల్లో పిడిఎఫ్‌కు కొంత మొగ్గు కనిపిస్తున్నట్లు చర్చ సాగుతోంది. అభ్యర్థుల గెలుపోటములు ఉత్తరాంధ్రలోని మొత్తం ఆరు జిల్లాల బలబలాలను బట్టి ఉంటుంది. విశాఖ నగరంలోని ఓట్లు అత్యంత కీలక పాత్ర పోషించనున్నాయి. నగరంలోని ఓట్లు పిడిఎఫ్‌కే ఎక్కువగా పడతాయని అంచనాలు వెలువడ్డాయి. అక్కడ ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం వల్ల పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. అనకాపల్లి జిల్లాలో పిడిఎఫ్‌కు వైసిపి గట్టి పోటీ ఇచ్చిందని వార్తలు వినిపిస్తున్నాయి. అటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో టిడిపి, పిడిఎఫ్ మధ్య హోరాహోరీగా ఓటింగ్ సాగిందని అంచనా. ఇటువంటి పరిస్థితుల్లో ఎవరికి వారే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అధికార పార్టీ నాయకులు వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల ప్రజానీకం ఆకర్షితులయ్యారని, ఆ పథకాలే తమను గెలిపిస్తాయని చెప్తున్నారు. టిడిపి నాయకులు మాత్రం సిఎం జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ వైఖరి తమ గెలుపునకు దోహదపడుతుందని, జనం కూడా ప్రభుత్వంపై విసిగిపోయి ఉన్నారని అంటున్నారు. వైసిపి అవలంభించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వ్యతిరేక విధానాలకు తోడు మన రాష్ట్రాన్ని మోసం చేసిన బిజెపిపై నోరు మెదపకపోవడం వంటి విధానాలు, వాటికి వ్యతిరేకంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీల పోరాటంలో నిబద్ధత తమకు విజయం చేకూరుస్తుందని రమాప్రభ మద్దతుదారులు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీలపై కొద్దోగొప్పో నమ్మకం ఉన్న వారూ రెండో ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ అభ్యర్థికే వేశారని మరికొందరి అంచనా. పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారో తేలడానికి రేపటి వరకు నిరీక్షించాల్సిందే.

ఆల్ ది బెస్ట్

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 109 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 57,122 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నాలుగో తేదీ వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లనూ అధికారులు పూర్తి చేశారు. పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 109 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు 57,122 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సర విద్యార్థులు 29,589 మంది కాగా, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 27,593 మంది హాజరు కానున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. పరీక్షా సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. 109 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 109 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు.


పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సమయానికి చేరుకునేలా ఆర్‌టిసి అధికారులు బస్సులను నడుపుతున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బందిని నియమించారు. సంబంధిత సచివాలయాల పరిధిలోని ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, ఆశా కార్యకర్త అవసరమైన వైద్య సేవలు అందించనున్నారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులను సిద్ధం చేశారు. పరీక్ష సమయంలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రశ్నాపత్రాలు తీసుకెళ్లే వాహనాలతో పోలీసు బృందాలను నియమించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ షాపులను మూసివేయనున్నారు.

సిసి కెమెరా నీడలో...

పరీక్షా కేంద్రాల్లో అక్రమాలను అడ్డుకునేందుకు పరీక్ష హాలు, ప్రిన్సిపాల్ గది, కారిడార్‌లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని ఇంటర్ బోర్డు కార్యాలయంతో పాటు విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఉన్న సర్వర్‌కు అనుసంధానం చేస్తారు. కొయ్యాం, కింతలి, తొగరాం, లావేరు, జి.సిగడాం, బారువ, గోవిందపురం, నౌపడ, కళింగపట్నంతో పాటు 17 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలోకి చీఫ్ సూపరింటెండెంట్ ఒకరికి మాత్రమే బేసిక్ మోడల్ సెల్‌ఫోన్‌ను అనుమతిస్తారు. ఇంటర్ బోర్డు పంపిణీ చేసిన ఈ ఫోన్ నుంచి మాత్రమే ఆర్ఐఒ, విజయవాడ ఇంటర్ బోర్డు కార్యాలయానికి ఏదైనా సమాచారం ఇవ్వాలి. పరీక్ష సమయంలో (ఉదయం 9.30 నుంచి 10.15 గంటల వరకు) మాత్రమే ఈ ఫోన్‌ను సిఎస్ వినియోగించాలి. అనంతరం బీరువాలో భద్రపరచాలి. మధ్యాహ్నం 12 గంటల్లోగా ఫోన్‌ను సిఎస్ వినియోగించాల్సి వస్తే దానికి కారణాలను తెలియజేస్తూ రిజిస్టర్‌లో రాయాలి.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విద్యార్థుల సౌకర్యార్థం ఆర్ఐఒ కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సమస్యలు, సందేహాల నివృత్తికి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఒక అధికారిని, సిబ్బందిని నియమించారు. ల్యాండ్ లైన్ నంబరు 08942-295933, సెల్ నంబర్ 8639313490ను సంప్రదించవచ్చని ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు తెలిపారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

దేశానికి మోదానీ ముప్పు

- అదానీ ఒప్పందాలు రద్దు చేయాలి
- పోర్టులను ప్రభుత్వపరం చేయాలి
- కుంభకోణంపై నేటి నుంచి ప్రచారం
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రధాని నరేంద్ర మోడీ మద్దతుతో అదానీ దేశంలో ప్రతి అంగుళాన్ని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. చరిత్రలో విదేశీ దురాక్రమణదారులను చూశామని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో స్వదేశీ దురాక్రమణదారులను చూస్తున్నామని చెప్పారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో 'దేశానికి మోదానీ ముప్పు' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ మద్దతుతో అదానీ దేశంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. మన రాష్ట్రం అందుకు మినహాయింపు కాదన్నారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టులను సొంతం చేసుకోవడమే కాకుండా విశాఖలో డేటా సెంటర్ పేరుతో 400 ఎకరాలను కారుచౌకగా గుంజుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

సోలార్ విద్యుత్ పేరుతో వేలాది ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అదానీకి కట్టబెడుతోందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆయుధ కర్మాగారం, పంప్‌డ్ స్టోరేజ్, హైడల్ విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో గిరిజనుల ఉనికికే ప్రమాదం ముంచుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లో జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టిన వైసిపి ప్రభుత్వం, అదానీకి అడిగిన చోటల్లా రాసి ఇస్తోందన్నారు. నిండా అప్పుల్లో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు ఆస్తులనూ కోల్పోబోతోందని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులనే కాదు ప్రజల ఆస్తులనూ అదానీ కొల్లగొడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ఆశ చూపుతూ సంపదను కోల్పోతున్నా ప్రజల నోళ్లు మూయిస్తోందన్నారు.

ప్రకృతి వనరులైన భూమి, నీరు, గాలి, సూర్యరశ్మి, అడవులు, గనులు ప్రతిదీ అదానీ కంపెనీ వశం చేసుకుంటోందన్నారు. జగన్ దన్నుతో రాష్ట్రాన్ని నిలువునా దోచుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతోందని విమర్శించారు. హిండెన్‌బర్గ్ నివేదికతో అదానీ అసలు రంగు బయటపడిందన్నారు. ప్రపంచ స్థాయిలో అప్రతిష్టపాలై దేశంలో ప్రభుత్వరంగాన్ని కొల్లగొట్టిన కుంభకోణంపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. ఆదానీ ఒప్పందాలను రద్దు చేయాలని, పోర్టులు ప్రభుత్వపరం చేయాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రం అదానీ పీడను వదిలించుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు ముందుకొచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మోడీ, అదానీ ముప్పు నుంచి దేశాన్ని, రాష్ట్రాన్ని రక్షించుకునేందుకు ప్రజలంతా కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు జిల్లాలో ప్రచార కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి పాల్గొన్నారు.

ఆ బాధ్యత అధికారులదే...

పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రైస్‌కార్డు ఉన్న లబ్ధిదారులందరికీ నిత్యావసర సరుకులు అందించే బాధ్యత అధికారులదేనని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ స్పష్టం చేశారు. పిడిఎఫ్ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్లు, సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నిత్యావసర సరుకులైన బియ్యం, కందిపప్పు, పంచదార తదితర సామగ్రి పంపిణీలో ఆలస్యానికి గల కారణాలపై ఆరా తీశారు. ప్రతి నెలా ఒకటో తేదీ నాటికి నిత్యావసర సరుకుల పంపిణీకి చేపట్టిన చర్యలను జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి రమణ వివరించారు. రికన్సిలేషన్ ఆలస్యం కాకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ తెలిపారు. లబ్ధిదారుల ఇంటికి ఎండియు వాహనం ద్వారా సరుకులను అందజేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ప్రతి నెలా 15వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వచ్చే అంశాల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, సివిల్ సప్లై తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



వంశధార, నాగావళి నదుల నుంచి తోడేస్తున్న ఇసుకాసురులు

వార్త... 6వ పేజీలో

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నులిపురుగుల నివారణకు పిల్లలందరూ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండాజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2 నుంచి 19 ఏళ్ల లోపు వారు ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. వీటి వల్ల ఏవిధమైన ఇబ్బందులూ ఉండవని తెలిపారు. తన పిల్లలకూ ఈ మాత్రలు వేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 4.40 లక్షల మంది పిల్లలు ఉన్నారని, వీరందరూ ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయని చెప్పారు. అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ఎండలు అధికంగా ఉంటాయని అందరు తరచూ మంచినీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, డిప్యూటీ డిఎంహెచ్ఒ అనురాధ, శ్రీదేవి, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాగ్దేవి, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.కృష్ణమోహన్, అప్పారావు, సోషల్ వర్కర్ మంత్రి వెంకటస్వామి, 104 మొబైల్ మెడికల్ యూనిట్ జిల్లా కో-ఆర్డినేటర్ లక్ష్మణరావు, జిల్లా ఇమ్యునైజేషన్ మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జిల్లాలో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ మరింత వేగవంతం కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్ఒలతో మంగళవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం గతంలో వేగవంతంగా చేసినా, మళ్లీ కార్యక్రమం వెనుకంజలో ఉందన్నారు. ఇలాగైతే అనుకున్న లక్ష్యాలను సాధించలేమని తెలిపారు. స్టోన్ ప్లాంటేషన్ విషయంలో క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు పూర్తిచేసిన స్టోన్ ప్లాంటేషన్లకు శతశాతం చెల్లింపులు చేసినట్లు చెప్పారు. కొన్నిచోట్ల మందకొడిగా సాగుతున్నట్లు దృష్టికి వచ్చిందని, ఇకపై ఇటువంటివి పునరావృతం కారాదని తేల్చిచెప్పారు. వీలైనంత త్వరగా స్టోన్ ప్లాంటేషన్ చేసి వాటికి సంబంధించిన బిల్లులను తమకు సమర్పిస్తే, వాటికీ చెల్లింపులు చేస్తామని హామీనిచ్చారు. ఇప్పటికే కొన్ని మండలాలకు స్టోన్స్ పంపామని, సరఫరా కాని మండలాలకు త్వరలో పంపుతామని చెప్పారు. స్టోన్ ప్లాంటేషన్‌లో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్, చెక్ పాయింట్ మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సబ్ కలెక్టర్లు రాహుల్‌కుమార్ రెడ్డి, నూరుల్ కమర్, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.



యువక్లబ్‌ను ప్రారంభిస్తున్న నారాయణరావు

'శర్వాణి'లో యువ క్లబ్ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా పర్యాటక ప్రదేశాన్ని తీసుకొచ్చేందుకు, పిల్లల నైపుణ్యం, పరిశుభ్రత, వివిధ కార్యక్రమాలు చేసేందుకు యువ పర్యాటక క్లబ్‌లు ఉపయోగపడతాయని జిల్లా పర్యాటక అధికారి నడిమిటి నారాయణరావు అన్నారు. నగరంలోని అరసవల్లిలో ఉన్న శర్వాణి విద్యాలయంలోని అధినేత అంధవరపు సూరిబాబు అధ్యక్షతన మంగళవారం యువ క్లబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 197 కిలో మీటర్ల తీరప్రాంతం, బుద్ధుని స్థలాలు, జైన స్థలాలు, చరిత్ర కలిగిన కోటలు ఉన్నాయన్నారు. జిల్లా పర్యాటక శాఖ ద్వారా విద్యార్థులను వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సహకర్తిస్తామని తెలిపారు. యూత్ కో-ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం చిరు ధాన్యాల గురించి విద్యార్థులకు వివరంగా తెలియజేశామన్నారు. శర్వాణి ప్రిన్సిపల్ రేఖ మాట్లాడుతూ పుస్తక విజ్ఞానంతో పాటు సమాజ విజ్ఞానం అవసరమన్నారు. శర్వాణి స్కూల్ కరస్పాడెంట్ అంధవరపు అంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను విద్యార్థులను ఈ నెలలో విహారయాత్రకు తీసుకెళ్లామని తెలిపారు. పర్యటన వల్ల విద్యార్థులకు చరిత్ర గురించి తెలిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనరు రాధాప్రసాద్, డి.రమేష్, దేవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం కాసులబాబు, ఉపాధ్యాయులు

పిల్లలవలస విద్యార్థుల ప్రతిభ

పొందూరు: తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి తృతీయ స్థానంలో నిలిచారు. పాఠవాలకు చెందిన విద్యార్థినిలు గురుగుబెల్లి ప్రియమణి, వావిలపల్లి దివ్య, పల్ల మాధురి విశేష ప్రతిభను చాటి మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుగ్గ కాసులబాబు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది కలిసి వ్యాయామ ఉపాధ్యాయులు గురుగుబెల్లి రాజశేఖర్ అభినందనలు తెలిపారు.


సామగ్రిని అందజేస్తున్న జగన్మోహనరావు

బాధితులకు సామగ్రి పంపిణీ

గార : మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ ఓనుమువానిపేటలో సోమవారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో పి.అప్పలరామయ్య, ఆవాలు లక్ష్మి, వనుము నీలమ్మలు సర్వసం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం శాఖ రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు బాధితులను మంగళవారం పరామర్శించారు. అనంతరం తక్షణ సాయం కింద కిచెన్ సెట్, ఆహార ధాన్యాలు, పంచ, చీర, దుప్పటి, లుంగి, తవ్వాలు టార్పాలిన్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు తీవ్రమవుతున్నాయని, అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు బి.చిన్మయిరావ్, కె.సత్యనారాయణ, జి.పవన్‌కుమార్, వి.మాదీన, సచివాలయ విఆర్‌ఒ జగదీశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

ప్రతి చిన్నారికీ నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేయాలని ఎంపిడిఒ పైలా సూర్యనారాయణ రెడ్డి, ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నెలవంక ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. అనంతరం డాక్టర్ కె.శశిధర్ మాట్లాడుతూ చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించాలన్నారు. ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రాష్ట్రీయ బాలస్వస్థలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి చిన్నారికీ నులి పురుగుల నివారణ(ఆల్బెండజోల్) మాత్రను తప్పక వేయించాలన్నారు. ఒకటి నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, ఆరేళ్లు నిండి 19 ఏళ్లు వయసు గల వారికి పాఠశాలలు, కళాశాలల్లో మందును పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒకటి నుంచి రెండేళ్ల చిన్నారులకు 200 మి.గ్రా (సగం) మాత్ర, 2 నుంచి 19 ఏళ్ల వయసు వారికి 400 మి.గ్రా మాత్ర ఒక్కొక్కటి చొప్పున పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, శివరాంప్రసాద్, మెడికల్ సిబ్బంది అభిమన్యు సోయి, కేశవరావు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అఖింఖాన్‌పేట పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. తోటపాలెం, కొంగరాం వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ల హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు విద్యార్థులకూ మందులను వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్త బరాటం జ్యోతి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మార్పు నారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందజేసి, వారి చేత తినిపించారు. కార్యక్రమంలో పాఠశాల, సచివాలయ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : మాత్రలు వేస్తున్న చిట్టిబాబు

పలాస: విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని, అందులో భాగంగానే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాశీబుగ్గ సాయికాలనీ, రంగోయి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం డీ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు ఆల్ బెండ్ జోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మందులను వాడడం ద్వారా పొట్ట పురుగులు మృతి చెంది ఆకలి పెంచుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరరావు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ, మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని మండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఆర్‌విజెకె ఆధ్వర్యాన డాక్టర్ రేవతి, భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో నరసమ్మ, పట్టణంలో జ్ఞాన భారతి విద్యా సంస్థలో కార్యదర్శి జోహార్‌ఖాన్, ట్రస్టీ రమణమూర్తి ఆధ్వర్యంలో 775 మందికి, స్వర్ణభారతి విద్యా సంస్థలో చైర్మన్ తులసీ దాస్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ నీలిమ పర్యవేక్షణలో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. లొద్దపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎంపిడిఒ రామారావు పరిశీలించారు.

బూర్జ : బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యాన ఎంపిడిఒ, ఎంఇఒ పర్యవేక్షణలో జెడ్‌పిహెచ్‌ఎస్, ఎంపిపి స్కూళ్లలో చదువుతున్న 2,420 మంది పిల్లలకు గాను 2,247 మందికి నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎంఇఒ నూక రామకృష్ణ, బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పావని, రాజశేఖర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల కళాశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందిగాం వైద్యాధికారులు ఎస్.చలమయ్య, కె.అనిత మాత్రలు పంపిణీ చేసిన అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ బి.దమయంతి ఉపాధ్యాయులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : నులిపురుగులను నివారిస్తేనే విద్యార్థులలో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపిడిఒ ఎం.రేణుక అన్నారు. మండలంలోని రామచంద్రపురం, టి.జొన్నవలస గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండోజో మాత్రాలను పంపిణీ చేసి వేయించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి ఎస్.వాసుదేవరావు, సర్పంచ్ ప్రతినిధి చల్ల కామేశ్వరరావు, పంచాయతీ సెక్రెటరీ రమణమ్మ, సచివాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జి.సిగడాం : స్థానిక ఎపి మోడల్ స్కూల్, ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వైద్యాధికారి హరిత విద్యార్థులకు నూలి పురుగుల నివారణా మాత్రలను పంపిణీ చేశారు. జి.సిగడాం ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒ అరసాడ రవికుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లంక అన్నాశామ్యూల్ ఎంపిడిఒ శ్రీనివాసరావు, పిఎంసి చైర్మన్ చిన్నారావు, ఎఎన్ఎం పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో నిమ్మాడ పిహెచ్ వైద్యులు డాక్టర్ నితీష్‌తో కలిపి విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను కె.ఫణీంద్రకుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైడి పోలినాయుడు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని తాడివలస, కింతలి పిహెచ్‌సిల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం నులిపురుగుల నివారణా మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. 15వ ఎన్‌డిడి కార్యక్రమంలో భాగంగా లోలుగు, తాడివలస, కింతలి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలల్లోను, అలాగే మానసవేణి ప్రయివేటు పాఠశాలలో ఈ మాత్రలను విద్యార్థులకు వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌నాయుడు, ప్రధానోపాధ్యాయులు లఖినాన హేమనాచార్యులు, వైద్య సిబ్బంది, అప్పారావు, కె.లక్ష్మీనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని సీతాపురం పాఠశాల, అంగన్వాడీ కేంద్రం బాలలకు డీ వార్మింగ్ మాత్రలను ఎంపిడిఒ హెచ్.ఈశ్వరమ్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయని శిరీష, అంగన్వాడీ కార్యకర్త బమ్మిడి భాగ్యవతి, వెల్ఫేర్ అసిస్టెంట్ భానుప్రసాద్, ఆశాకార్యకర్త టి.చిన్నమ్మ, వాలంటీర్ ప్రశాంతి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని చాపర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేంద్రరరావు డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి పి.హేమంతలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


ఆమదాలవలస : పరిశీలిస్తున్న ఎంపిడిఒ రేణుక


కవిటి : నులిపురుగుల నివారణ మాత్రను వేస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి


కోటబొమ్మాళి : పంపిణీని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్


ఇచ్ఛాపురం : పంపిణీని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రామారావు


పొందూరు : మాత్రలను వేస్తున్న హెచ్‌ఎం హేమనాచార్యులు

వసతిగృహ విద్యార్థులు డిశ్చార్జి

పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి మండలంలోని పోలవరంలో ఉన్న బిసి బాలుర వసతి గృహ విద్యార్థులు 39 మంది సోమవారం తీవ్ర అస్వస్థతకు గురై టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చేరిచికిత్స పొందుతున్న విషయం విదితమే. కాగా, మంగళవారం నాటికి ఆరోగ్యం కుదుటపడడంతో మధ్యాహ్నం వైద్యులు డిశ్చార్జ్ చేసి వసతిగృహానికి పంపించారు. వసతిగృహం విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన అంశం జిల్లాలో కలకలం రేపడంతో కలెక్టర్ ఆదేశాలతో అధికార, వైద్యారోగ్యశాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, టెక్కలి జిల్లా ఆస్పత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలవరంలోని వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అదే విధంగా మంగళవారం ఉదయం డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మీతులసీ, బిసి సంక్షేమశాఖ అధికారి ఇ.అనురాధ, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ టి.త్రినాథరావులు ఆస్పత్రిని సందర్శించి వివరాలు సేకరించారు. అయితే విద్యార్థుల అస్వస్థతకు తాగునీరు కారణమని వైద్యులు భావిస్తున్నారు. ఈ మేరకు వసతి గృహంలో విద్యార్థుల ఆరోగ్యం కుదుటపడే వరకూ మాంసాహారాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు బిసి సంక్షేమశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్య పరిస్థితికి అనుకూలంగా ఉండే విధంగా తేలికగా, అరుగుదలయ్యే శాఖాహార భోజనంతో పాటు పళ్లను అందించాలని సంబంధిత వార్డెన్ టి.అప్పారావును ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులూ ఆస్పత్రికి చేరుకున్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అనురాధ

క్షేత్ర సందర్శనకు ఆదివాసీ యువత

ప్రజాశక్తి- బూర్జ

ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో శక్తి జిల్లాలో నివేదిత ఫౌండేషన్ అమలు చేస్తున్న పథకాలను పరిశీలించేందుకు ఆదివాసీ యువతను మంగళవారం క్షేత్ర సందర్శనకు పంపిస్తున్నట్లు ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం లాంఛనంగా బస్సు యాత్రను ప్రారంభించారు. ఛత్తీస్‌గడ్‌లో ఆదివాసీ సుపరిపాలన, సాధికారిక, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు, అక్కడ సంక్షేమ కార్యక్రమాలను పరిశీలిస్తారన్నారు. అక్కడ వాటిని నేర్చుకొని ఇక్కడ ఆదివాసీ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, కురుపాం, పాచిపెంటగుమ్మ లక్ష్మీపురం మండలాల నుంచి ఆదివాసీ యూత్ లీడర్లు, ఆర్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.


జెండా ఊపి ప్రారంభిస్తున్న సన్యాసిరావు

కుక్కల దాడిలో ఆవు, దూడ మృతి

నౌపడ: వీధి కుక్కలు దాడిలో ఆవు, దూడ మతి చెందాయి. నౌపడకు చెందిన బి.రాజారావు సోమవారం రాత్రి తన పశువుల శాలలో ఆవు, దూడను కట్టారు. అర్ధరాత్రి సమయంలో కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాయి. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా... సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గాంధీ రోడ్, మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఇప్పటి వరకు 10 ఆవులపై కుక్కలు దాడి గాయపరిచాయని, భవిష్యత్‌లో పిల్లలపై, విద్యార్థులపై దాడి చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.


మృతి చెందిన ఆవు, దూడ

ఇళ్లు మంజూరు చేయాలి

బూర్జ : నిరు పేదలమైన తమకు జగనన్న ఇళ్లు మంజూరు చేయాలని మండలంలోని డొంకలపర్తకు చెందిన జడ్డు తహిత్‌నాయుడు, జడ్డు రామనాయుడు కోరారు. ఈ మేరకు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. నవరత్నాల్లో భాగంగా అర్హులకు సొంతింటి కల నెర వేర్చడమే ప్రస్తుత ప్రభుత్వ ధ్యేయమని సిఎం చెబుతున్నాయని అన్నారు. అయితే వాలంటీర్లు, సచివాలయ స్థాయిలో ఆ పనులు పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చుట్టూ పదేపదే తిరిగినా ఇప్పటికీ స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.


దగ్ధమైన సామగ్రి

ఫొటో స్టూడియో దగ్ధం

పలాస : కాశీబుగ్గ ఫ్రెండ్స్ డిజిటల్ వరల్డ్ ఫొటో స్టూడియోలో మంగళవారం వేకువ జామున అగ్నిప్రమాదం సంభవించింది. స్టూడియోలో ఉన్న కెమేరాలు, కంప్యూటర్లు, ట్విస్టర్ వీడియో మిక్సింగ్ సిస్టమ్‌లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. పక్కనున్న బేంగిల్స్ స్టోర్ సైతం అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న ఫొటో స్టూడియో యజమాని బి.ఈశ్వరరావు ఘటనా స్థలానికి వచ్చే సరికి దుకాణంలో సామగ్రి కాలిపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

దుస్తుల పంపిణీ

నరసన్నపేట: తమ బిడ్డ పుట్టిన రోజు సందర్భంగా వికలాంగులకు, అనాథలకు దుస్తులు పంపిణీ చేసి పలువురికి ఆదర్శంగా నిలిచిన రాంబాబు, హేమలత దంపతులను ఎంఇఒ ఇ.శాంతారావు అభినందించారు. స్థానిక భవితా కేంద్రంలోని వికలాంగులకు పోలాకి మండలం సంతలక్ష్మీపురానికి చెందిన రాంబాబు, హేమలత దంపతులు తమ బిడ్డ పుట్టిన రోజు సందర్భంగా 20 మందికి దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో సంతలక్ష్మీపురం సర్పంచ్ యారాబాటి నేలవేణి, రమణ, కృష్ణవేణి, శ్రీనివాస్, భానుమూర్తి, రూప, మాణిక్యం పాల్గొన్నారు.


పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తున్న ఎంఇఒ శాంతారావు


ఆటోలో వెనుక కూర్చున్న చిన్నారులు

పట్టుజారిందో అంతే...

ప్రజాశక్తి- బూర్జ

చదువుకోవాలన్న ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. రోజూ ప్రమాదకరమైన ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పడం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సోమదాలవలస, ముసానపుట్టి, అనంతగిరిపేట, జంగాలపాడు గిరిజన గ్రామాలకు ప్రభుత్వ పాఠశాలలు లేవు. దీంతో ఆయా గ్రామాల గిరిజన విద్యార్థులు సమీపంలోని మదనాపురం, తోటవాడ, పాలవలస గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు పిల్లలను ఆటోలో పంపిస్తున్నారు. పిల్లల చదువుల కోసం ప్రమాదం ముంచి ఉందని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో పంపిస్తున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు. అయితే ఆయా పాఠశాలకు తమ పిల్లలను పంపించేందుకు ఆటోలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారని, కానీ, ఇంతవరకు ఆటో వేయలేదని వాపోయారు. తమ పిల్లలకు చదువుల కోసం తామే ఆటోలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గ్రామాలకు తమ పిల్లలను ఒక ఆటోలనే 20 మంది కన్న ఎక్కువ పిల్లలు పంపించాల్సి వస్తోందని చెప్పారు. మరోవైపు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధం అధికారులు, పాలకులు స్పందించి తమ గ్రామాల్లో పాఠశాల ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో గ్రామానికి ఒక ఆటో నైనా ఏర్పాటు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.


ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుక

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో ఒకవైపు వంశధార, మరోవైపు నాగావళి నదులు ఉండడంతో ఇసుకాసురులకు కాసులు గలగల కురిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో నదుల నుంచి ఇసుకను అక్రమంగా తోడేస్తూ సొమ్ము చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. వంశధార నది పరివాహక ప్రాంతాలైన పురుషోత్తపురం, అలమాజీపేట, చెవ్వాకులపేట గ్రామాల పరిధిలోని రేవుల నుంచి అక్రమంగా ఇసుకను తరలించకపోతున్నారు. చిట్టివలసకు చెందిన కొందరు అధికార పార్టీకి చెందిన ట్రాక్టర్ యజమానులు ఈ దందాను కొనసాగిస్తున్నారు. రాత్రి పది గంటల తర్వాత సంగమయ్య కొండ కూడలిలోని బస్సు షెల్టర్ వద్ద అక్రమార్కులు వారి మనుషులతో నిఘా పెడుతున్నారు. వారు రూట్ క్లియరెన్స్ ఇచ్చాక ఇసుక ట్రాక్టర్లు ఒకదాని వెనుక ఒకటి బయలు దేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే నాగావళి నది తీర ప్రాంతాలైన దూసి, తొగరాం, కొత్తవలస, నిమ్మతొర్లాడ, కొరపాం, జి.కె.వలస గ్రామాల్లోనూ ఇసుకను రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. ముందుగా గృహ యజమానులతో ఒప్పందం కుదుర్చుకొని మూడు, నాలుగు రోజులకు ఒకసారి ఇసుకను రాత్రి వేళల్లో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి వేళల్లో కొత్తవలస, కట్యాచార్యులపేట, బొడ్డేపల్లిపేట కూడళ్లల్లో కాపలాదారులను పెట్టి యథేచ్ఛగా అక్రమ ఇసుకను గమ్యస్థానాలకు చేర్చేస్తున్నారు. రాత్రి వేళలో ఎవరైనా గస్తీ సిబ్బంది తారసపడితే ఎంతో కొంత నగదును ముట్టజెప్పి వెళ్లిపోతున్నట్లు ఆరోపినలు వినిపిస్తున్నాయి. ఎస్ఇబి, సివిల్ స్టేషన్ల అధికారులు కనీసం ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. నెలకో రెండు నెలలకు ఓసారి ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ట్రాక్టర్ యజమానులు అధికారుల మధ్య సత్సంబంధాలు కలిగి ఉండటంతో చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరం. అటువంటి వారిపై చర్యలు తప్పవు. సిబ్బందితో ఇసుక అక్రమ రమణాపై నిఘా పెడతాం. మైన్స్, పోలీస్ అధికారులకు సమాచారం అందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం

– ఎస్.గణపతి, తహశీల్దార్

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాసలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస ఆంజనేయ స్వామి ఆలయం నుంచి గతంలో నిలిచిపోయిన కాలువ పనులు రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఒకేలా రోడ్డు విస్తరణ ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మున్సిపల్ డిఇఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్ తదితరులు ఉన్నారు.


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

వినియోగదారుల చట్టంపై అవగాహన అవసరం

వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ చలం

పలాస : వినియోగదారులు చైతన్యం కావాలని, అందుకు వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్.వి.చలం అన్నారు. బుధవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 గతం కంటే సత్వర న్యాయం అందిస్తోందన్నారు. నిత్య జీవితంలో రోజూ వస్తువులు కొనుగోలు చేస్తుంటామని. కల్తీ, నకిలీ వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నాణ్యత ప్రమాణాల్లో లోపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మోసపోయే సందర్భంలో ఉదాసీన వైఖరి వహించక సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. వినియోగదారులు నష్టపోయే సందర్భంలో నష్టపరిహారం కోసం వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలపై జాగ్రత్త వహించాలన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, రక్షణ చట్టం కోసం విస్తృత ప్రచారం అవసరమని తెలిపారు.


చలం

'ఐతమ్' అధ్యాపకునికి సి.వి రామన్ అవార్డు


ప్రశంసాపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్‌హెచ్ హెచ్‌ఒడి ప్రొఫెసర్ ఆర్.శాంతికుమార్ 2022 విద్యా సంవత్సరంలో డాక్టర్ సివిరామన్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శాంతికుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతికుమార్ 'కాస్మాలజీ, రిలేటివిటీ'లపై చేసిన పరిశోధనలకు ఫలితంగా కేరళకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ సెంటర్ ఈ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. కార్యక్ర మంలో ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బిఎస్అండ్‌హెచ్ విభాగం అధ్యాపకులు డాక్టర్ లక్ష్మణరావు, ప్రొఫెసర్ ఎం.రమణయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పైడితల్లి అమ్మవారి జాతర

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పట్టణంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి జాతర మంగళవారంతో ముగిసింది. ఈ జాతరకు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా నుంచి యాత్రికులు పెద్ద ఎత్తున జాతరకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం పెద్ద ఎత్తున వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేలా పటిష్ఠ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

దర్శించుకున్న ప్రముఖులు

చివరి రోజు పైడితల్లి అమ్మవారిని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, నాయకులు బాడాన శేషగిరినాయుడు, బలగ శంకరభాస్కరరావు, ఎంఎస్ఎన్, తదితరులు దర్శించుకున్నారు. అలాగే స్పీకర్ తమ్మినేని సీతారాం సతీమణి వాణిమ్మ, కుమారుడు చిరంజీవినాగ్, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి, పిఏసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైసిపి నాయకులు కిల్లి నాగేశ్వరరావు, బాడాన కృష్ణారావు, గుడ్ల మోహనరావు, గాడు నాగరాజు దర్శించుకున్నారు.


దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న యాత్రికులు

నవధాన్యాల సాగుతో భూసారం పెంపు



సంతబొమ్మాళి : ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

రైతులు వారికున్న పొలాల్లో పంట కోసిన అనంతరం 18 నుంచి 30 రకాల విత్తనాలతో ఎకరానికి 12-13 కేజీలు పచ్చిరొట్ట విత్తనాలు జల్లుకోవడం ద్వారా నేలలో భూసారం పెరుగుతుందని, తద్వారా పండించిన పంటలకు దిగుబడి వస్తుందని ప్రకృతి వ్యవసాయ ఎస్‌డి ఎ.పి.సింహాచలం అన్నారు. మండలంలోని సవరపేట, గోవిందపురం గ్రామాల్లో రైతులతో నవధాన్యాలు సాగు- నేల తల్లికిబాగు అనే అంశంపై రైతులతో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 రకాల విత్తనాల్లో పచ్చిరొట్ట విత్తనాలు, పప్పుధాన్య విత్తనాలు, ఆకుకూరల విత్తనాలు, నూనెజాతి విత్తనాలు, కాయగూరల విత్తనాలు, సుగంధ ద్రవ్యాలు (మెంతులు, ఆవాలు కొత్తిమీర) తదితరవి ఎకరానికి 12 కేజీలు వేయాలన్నారు. 45 రోజుల వరకు పెరగనిచ్చి పెరిగిన పైరును పశువులకు దాణాగా వేసి మిగిలిన పంటను కలియ దున్నాలని అన్నారు. తద్వారా నెలలో స్థూల, సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. తరువాత వేసే పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో గోవిందపురం సర్పంచ్ రెయ్య రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎస్.ఢిల్లేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ విభాగ సభ్యులు కె.ఉషా, కె.సూర్యారావు, టి.విజయ పాల్గొన్నారు.



ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

ఆమదాలవలస : నవధాన్యాలు సాగు చేసి భూసారాన్ని రైతులు పెంచాలని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని చేపేనపేట యూనిట్ పరిధిలోని నిమ్మతొర్లాడలో నవధాన్యాలు సాగు చేయాలి-భూసారం పెంచాలి అంటూ రైతులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బూర్జ : సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించాలని డిఎల్‌డిఒ వాసుదేవరావు సూచించారు. మండలంలోని కొరగాం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. ప్రజలకు సకాలంలో సేవలందించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న భవానీశంకర్

ఆస్పత్రి పరిశుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వాస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. ఆస్పత్రి ఆవరణలో మంగళవారం కాంట్రాక్టు కార్మికులతో, పారిశుధ్య కార్మికులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో పడక గదులకు కుక్కలు వస్తున్నాయని, దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై దృష్టిసారించాలని అన్నారు. ఆస్పత్రి ఆవరణతో పాటు రోగుల పడక గదులు, మంచాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ తిరుమలరావు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పలాస: మండలంలోని రెంటికోటలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని సర్పంచ్ శాసనపురి తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు పిడబ్ల్యుఎస్ తాగునీటి పథకం మరమ్మతు పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ప్రజలు తాగునీటి కోసంకోసం ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ఈ పథకానికి మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. ఆయనతోపాటు కార్యదర్శి సద్గురు బాబు, వార్డు మెంబర్లు ఉన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

జి.సిగడాం : జి.సిగడాం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షా కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ ఎ.సన్యాసిరావు మంగళవారం పరిశీలించారు. మొదటి సంవత్సరం 242 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 217 మంది పరీక్ష రాస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.ఫాల్గుణరావు ఆయనకు వివరించారు. ఈయన వెంట డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జి.నారాయణనాయుడు, వైస్ ప్రిన్సిపాల్ కె.ధర్మారావు ఉన్నారు.


కేంద్రాన్ని పరిశీలిస్తున్న సన్యాసిరావు

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని నివగాంకు చెందిన తవితయ్య అనారోగ్యంతో బాధపడుతూ రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికస్తోమత అంతంతమాత్రంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు ఆస్పత్రికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పది వేలును ఆయన భార్య లక్ష్మికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చోడవరపు బాలకృష్ణ, నడిమింటి జగదీష్, లోతుగెడ్డ శివ పాల్గొన్నారు.



కొత్తూరు : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు


మెళియాపుట్టి : ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

మెళియాపుట్టి : మండలంలోని పలు గ్రామాల్లోని పలు కుటుంబాలను టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు ఆర్థికసాయం అందించారు. జాడుపల్లికి చెందిన మల్లిపెద్ది రమ, మురికింటిభద్రకు చెందిన రాజాన రాజారావు ఇటీవల మృతి చెందారు. కరజాడకు చెందిన నెమలిపురి శోభారాణి మానసిక వ్యాధితో బాధపడుతుంది. సంతలక్ష్మీపురానికి చెందిన రండి దామోదరరావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న గోవిందరావు వారి కుటుంబ సభ్యులందరికీ రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ఎంపిటిసి మాజీ సభ్యులు సమలాపురం ఎల్లంనాయుడు, తిరుపతిరావు, కూర్మారావు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

కోటబొమ్మాళి: పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలు తప్పని సరిగా వేయాలని మండల పశువైద్యాధికారులు డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్, డాక్టర్ ప్రజ్ఞచైతన్య, డాక్టర్ కె.వెంకటేష్‌లు అన్నారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామయ్యపేట, తర్లిపేట గ్రామాల్లో 233 పశువులకు గాలికుంటు నివారణా టీకాలను మంగళవారం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం వచ్చి 104-106 డిగ్రీలు ఉంటుందని, నోటి నుంచి తీగల మాదిరి చొంగ కారడం, నోటిలో, కాలి గిట్టల మధ్య పుళ్లు ఏర్పడటం, తిండి


టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

మందగించి నీరసించడం, చిన్న ఎండకు రొప్పడం, చుడి పశువులు ఈసుకుపోవటం, ఎడ్లలో పని సామర్థ్యం తగ్గుతుందన్నారు. ఈ వ్యాధి సోకిన తరువాత వైద్యం ఆలస్యం చేస్తే పశువులు చనిపోయి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందన్నారు. పశువులకు టీకాలు వేయించుకుని పశువుల ఆరోగ్య పరిరక్షణ చేపట్టాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు ఎస్.చిరంజీవి, నారాయణ పాల్గొన్నారు.


హరికథను ఆలపిస్తున్న యతిరాజు

ఘనంగా 'గగ్గాసుని' ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గి.గొనపపుట్టుగలో మంగళవారం గగ్గాసుని అమ్మవారి ఆలయ పున:ప్రతిష్ఠ మహోత్సవం గ్రామస్తులు వైభవోపేతంగా నిర్వహించారు.ఉదయం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, నర్తు రామారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, డి.గొనపపుట్టుగ సర్పంచ్ బెందాలం కిరణ్‌కుమారి, సర్పంచ్ ప్రతినిధి బెందాలం జయప్రకాష్, ఎంపిటిసిలు పూడి నీలాచలం, బి.పూర్ణ చంద్రుడు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, జల్లు యుగంధర్, పండి దేవేంద్రమూర్తి పాల్గొన్నారు.